

భూగర్భ జలాలు పెరిగేలా..

- వాన నీటిని ఒడిసి పట్టేందుకు వాటర్‌షెడ్ పథకం
- నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- జిల్లాలో నాలుగు మండలాల్లో రూ. కోటితో అభివృద్ధి పనులు
- వ్యవసాయ ఆధారిత జీవనోపాధిపై ప్రత్యేక శ్రద్ధ
- పంటల సాగుతో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయం
- ఆసక్తి చూపుతున్న రైతులు



వాటర్‌షెడ్ పథకంలో నిర్మించిన చెక్‌డ్యాం

వానాకాలంలో వర్షాలు విస్తారంగా కురిసినప్పటికీ ఆ నీరంతా వృథాగా పోతున్నది. దీంతో భూ గర్భ జల మట్టం పడిపోతున్నది. ఈ పరిస్థితులను దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసు కుంటున్నాయి. భూగర్భ జలాల పెంపునకు వాట ర్‌షె డ్ పథకంలో చెక్‌డ్యాంల నిర్మాణం చేపడుతున్నాయి.

ఆసిఫాబాద్‌రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో భూసార, జలసం రక్షణకు వర్షం నీటిని వినియోగించుకోవడం పశుగ్రాసం, పచ్చదనం అభివృద్ధి పరిచి నిరు పేద రైతులకు జీవా నోపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు సమగ్ర నీటి పరివాహక కార్యక్రమాలు(వాటర్‌షెడ్)ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వ హిస్తున్నాయి. భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆ ప్రాంతాల్లోనే పర్క్యులేషన్ ట్యాంకులు, చెక్‌డ్యాంలు, రాళ్ల కట్టలు తదితర నిర్మా ణాలు చేపట్టనున్నారు. కొండలు, గుట్టల నుంచి వచ్చే వర్షపు నీరు వృథా కాకుండా వాటిలో నిల్వ ఉండేలా నిర్మించనున్నారు.

● వర్షం నీటికి అడ్డుకట్ట..

వాగులు, వంకల ద్వారా వృథాగా పోతున్న వర్షం నీటికి అడ్డుకట్ట వేసి నీటి నిలువ భూగర్భ జలాల గరిష్ట స్థాయిని పెంచేందుకు చేపడుతున్న వాటర్‌షెడ్ పథకం జిల్లాలో సత్ఫలితలిస్తున్నాయి. వాటర్‌షెడ్ పథకంలో భాగంగా 2021 మార్చిలో ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంటలో 2,850 హెక్టార్లు, కెరమెరి మండలంలోని పరందోళిలో 3,619 హెక్టార్లలో, జైనూరు మండలంలోని రాశిమెట్టలో 3.260 హెక్టార్లలో, లింగాపూర్ మండలం లోద్దిగూడలో 3,513 హెక్టార్లలో మొత్తం జిల్లాలోని నాలుగు మండలాల్లో 13,251 హెక్టార్లను గుర్తించి ఈ పథకంలో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నీటి నిలువలు పెంచేందుకు జల సంరక్షణ, నేల సంరక్షణ పనులు చేపడుతున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని నాలుగు మండలాల్లో కోటి రూపాయలతో పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రాళ్లకట్టలు, ఊటకుంటలు, చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారు. చిర్రకుంట ప్రాజెక్టు పరిధిలో 14, లింగాపూర్‌లో 17, పరందోళిలో 15, జైనూరులో 12 ఊట కుంటల నిర్మాణ పనులు, మూడు చెక్‌డ్యాం పనులను పూర్తి చేశారు. ఇంకా 41 ఊట కుంటల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ పథకం ద్వారా నాలుగు ప్రాజెక్టులలో 17 కమ్యూనిటీ షెడ్‌లు కూడ ఏర్పాటు చేశారు. ఈ షెడ్‌లు ఆయా గ్రామాలలోని ప్రజలు సమావేశాలకు శుభకార్యాలకు ఉపయోగించుకుంటున్నారు. జిల్లాలో కొనసాగుతున్న వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలోని పనులను ఇప్పటికే కేంద్ర జలశక్తి కమిటీ అధికారులు, రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ పథకం ద్వారా భూగర్భ జలాలు మెరుగుపడి సాగు విస్తీర్ణం పెరగడంతో రైతులు అసక్తి చూపుతున్నారు.

● పథకం ముఖ్య ఉద్దేశ్యం..

ఎత్తైన ప్రదేశాల్లో పడిన వర్షం నీరు వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి నిల్వ చేయడమే వాటర్‌షెడ్ పథకం ముఖ్య ఉద్దేశ్యం. నేల, నీరు, వృక్ష సంపదలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు పేదల వ్యక్తిగత భూములు పశువులు, పండ్లతోటలు, చేపల పెంపకం వాటితో ఉత్పాదకత పెంపొందించేందుకే అ మలు చేస్తున్నారు. పేదల ప్రస్తుత జీవానోపాదులను మెరుగు పరుచుకోవడం కొత్తగా జీవానోపాధి అవకా శాలను కల్పించి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచాలనే ప్రభుత్వాలు భావిస్తున్నాయి. పనులు అస్తుల నిర్వహణ మరమతులకు ప్రజలే పూర్తి బాధ్యత వహించేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. వాటర్‌షెడ్ ప్రవేశిక కార్యక్ర మాల్లో భాగంగా అందరికి ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ షెడ్లు, బస్సు షెల్టర్లను నిర్మించ నున్నారు. వాటర్‌షెడ్ నిధుల నుంచి 15 శాతం నిధులు కేటాయించి రైతు లకు 75 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు, గిరిజన మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అం దించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

నీటి కొరత తీర్చేందుకే..

- అంజనేయులు, పీవో, వాటర్‌షెడ్



భూగర్భ జల మట్టం తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి కొరత లేకుండా చేసేందుకు నీటి ఊట కుంటలను నిర్మించి నీటి నిలువ సామార్థ్యలను పెంచుతున్నాం. నిర్మాణంలో ఉన్న ఊట కుంటలను త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- దత్తారాం, డీఆర్‌డీవో



వాటర్‌షెడ్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకంలో భాగంగా రైతుల ఉత్పాదకత పెరుగుదల కోసం 75 శాతం సబ్సిడీతో వ్యవసాయానికి సంబం ధించిన పనిముట్లను అందించేందుకు త్వరలోనే దర ఖాస్తులు తీసుకుంటాం. జిల్లాలోని నాలుగు ప్రాజె క్టుల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

త్వరలో పోడు భూముల సమస్య పరిష్కారం



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

బెజ్జూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో పోడు భూముల సమస్య పరిష్కారవుతుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దనే నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నీరందిస్తామని తెలిపారు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు వల్ల ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీజేపీ పార్టీకి పేదలపై ప్రేమ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఊరూరా పాఠశాలలు, రోడ్లు, ఆసుపత్రులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును రద్దు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంతానికి అన్యాం చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు అందరు కలిసి కట్టుగా పని చేయాల న్నారు. పోడు భూముల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. సుస్మీర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, నాయకులు పుష్పలత, అర్షద్ హుస్సేన్, విశ్వేశ్వర్‌రావు, జగ్గాగౌడ్, సుగుణ, లింగయ్య, భాగ్య, శంకర్, చెన్నయ్య, రమేష్, రాజ్మ, నాహిర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్

ఆసిఫాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్ గెలుపొందాడు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా వారణాసి శ్రీనివాస్, కోశాధికారిగా కలకుంట్ల శ్రీధర్ గెలుపొందారు. కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు రామ్మోహన్, హనుమయ్య, సురేష్, అబ్దుల్ రెహమాన్, మహేష్, కృష్ణం రాజు, తారు, మీర్జా సలీం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



బెజ్జూరులో స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

బెజ్జూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బెజ్జూరు, సిర్పూర్ (టి) మండలాల్లో ఆదివారం నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకకున్నారు. బెజ్జూరు మండలంలోని సుస్మీర్- కుశ్నపల్లి గ్రామాల మధ్య ఆదివారం రెండు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నామని బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కుకుడ గ్రామానికి చెందిన ఎర్మ ప్రశాంత్, గెడెం అనీల్ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై 30కిలోల నకిలీ పత్తి విత్తనాలు తీసుకవస్తుండగా కుశ్నపల్లి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డాయని చెప్పారు. పట్టుబడిన పత్తి విత్తనాలు ఎక్కడివని విచారించగా సుస్మీర్ గ్రామానికి చెందిన తలండి సురేష్ వద్ద తెచ్చామని చెప్పడంతో, అతని చేనులో పాతిపెట్టిన మరో 170కిలోలు లభ్యమైనట్లు తెస్పై తెలిపారు. సిర్పూర్(టి) మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్ వద్ద నుంచి పత్తి విత్తనాలు తెచ్చామని విచారణలో తేలిందని అన్నారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తఎలిపారు. పట్టుబడ్డ పత్తి విత్తనాల విలువ రూ.6లక్షలు ఉంటుందని అన్నారు.

భూపాలపట్నంలో 20 కిలోలు..

సిర్పూర్(టి), మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ఆదివారం 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన సిడాం సత్యనా రాయణ, బొల్లబోయిన శ్రీను, పల్స రమేష్, మరో వ్యక్తి ఇంటి నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నామని చెప్పారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఏవో గిరీష్ కుమార్‌ను పిలిపించి పరిశీలించగా పత్తి విత్తనాలు నకిలీవిగా నిర్ధారించారని తెలిపారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లు వస్తున్నారు

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు
- జిల్లాలో శిక్షణకు 190 మంది దరఖాస్తులు
- మొదటి విడతలో 107 మంది ఎంపిక



ఆసిఫాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సర్వేయర్ల కొరతను అధిగమించడానికి చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించగా జిల్లాలో 190 మంది దరఖాస్తు చేసుకోగా 107 మందిని ఎంపిక చేసి నేటి నుంచి శిక్షణ ఇవ్వనుంది. త్వరలోనే వారి సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలను అమలు చేస్తోంది. రిజిస్ట్రేషన్‌ల సమయం లోనే రైతులకు ఇక పై భూమి కొలతలు, హద్దులు, వివరాలతో కూడిన మ్యాప్(స్కెచ్) కూడా అందించాలని నిర్ణయించింది. భూముల లావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా జరిగేందుకు ఈ విధానం ఎంతగానో ఉయోపపడుతుందని భావిస్తోంది. ఈ విధానాన్ని త్వరలోనే అమలులోకి తీసుకు రావడం కోసం ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను తీసుకు రావాలని నిర్ణయించింది. సర్కారు పదిహేను రోజుల క్రితమే లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 17 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. సివిల్ సబ్జెక్టుతో ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 190 మంది దరఖాస్తు చేసుకోగా 107 మందిని మొదటి విడతలో ఎంపిక చేసింది. ఈ నెల 26 నుంచి సుమారు రెండు నెలల పాటు (50 పనిదినాలు)శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ధ్రువీకరణ పత్రాలు అంజేశారు. అనంతరం వారు క్షేత్రస్థాయిలో సేవలందిస్తారు.

నేటి నుంచి శిక్షణ..

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, లావాదేవీలు మరింత పారదర్శకంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల ప్రక్రియ ప్రారంభిస్తుంది. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ సర్వేయర్ల కోసం 190 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో 107 మందిని ఎంపిక చేసింది. ఎంపికైన వారికి ఈ నెల 26న ధ్రువపత్రాల పరిశీలన, శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో 50 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. శిక్షణ అనంతరం తుది పరీక్షను నిర్వహిస్తాం. ఎంపిక చేసిన వారు జన్కాపూర్ రైతు వేదికలో హాజరు కావాలి.

- సోమేశ్వర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

భూ వివాదాలు ఉండకూడదనే..

లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానాన్ని అమలు చేయడం ద్వారా భవిష్యత్‌లో భూములకు సంబంధించిన వివాదాలు తగ్గు ముఖం పట్టే అవకాశాలు ఉంటాయని సర్కారు భావిస్తోంది. ఎందు కంటే ప్రస్తుతం రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం లాంటి వివరాలతో మాత్రమే రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఆ భూమికి సంబంధించిన మ్యాప్ ఉండదు. కానీ లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే రిజిస్ట్రేషన్ కంటే ముందే భూమికి సంబంధించిన మ్యాప్(స్కెచ్) తయారు చేస్తారు. దానిని సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తరువాత ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటేనే ఆమోదిస్తారు. ఈ మ్యాప్‌లోనే అన్ని వివరాలు ఉంటాయి. దీంతో ఇప్పుడున్న దానికంటే శాస్త్రీయమైన పద్దతిలో రిజిస్ట్రేషన్‌లు జరిగే అవకాశం ఉంటుంది. భూ భారతితో పాటు సర్వే మ్యాప్‌ల రూపకల్పన కూడా ఒకే సమయంలో అందుబాటులోకి తీసుకు రావాలనే యోచన ప్రభుత్వం ఉంది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి, మే 25 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఎస్సై ప్రశాంత్ అంద జేశారు. ఖమాన గ్రామానికి చెందిన శంకర్ సెల్‌ఫోన్ పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్‌ను గుర్తించిన కానిస్టేబుల్ నయీమ్‌ను ఎస్సై అభినందించారు. బాధితులు సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

బావిలో పడి మహిళ మృతి

సిర్పూర్(యు), మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోరతాండ సమీపంలో గల వ్యవసాయ బావిలో పడి లింగాపూర్ మండలం గుంనూర్ గ్రామానికి చేందిన కనక జారుబాయి(58) అనే మహిళా మృతి చెందినట్లు జైనూర్ సీఐ రమేష్, ఏఎస్సై గంగారాం తెలిపారు. ఆదివారం జైనూర్ సీఐ రమేష్, ఏఎస్సై గంగారాంలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బావిలో పడి ఉన్న మృతదేహంను పరిశీలించారు. కనక జారుబాయి గురువారం ఇంట్లో నుంచి ఎవరికి చేప్పకుండ వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు మూడు రోజులుగా ఆమె ఆచూకీ కోసం గాలించారు. జారుబాయి కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. జారుబాయి భర్త కనక జంగు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షాలు

- దెబ్బతిన్న జొన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు



దెబ్బతిన్న జొన్న పంట

కెరమెరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న అకాల వర్షాలకు చేతికందిన జొన్న పంట దెబ్బతిన్నది. మండలంలోని సావర్‌ఖేడ, ధనోర, సుర్దాపూర్, సాంగ్వి, గోయగాంతో పాటు మండలం వ్యాప్తంగా సుమారు 1,400 ఎకరా ల్లో జొన్న పంట వేసినట్లు రైతులు చెబుతున్నారు. కంకి నల్లబడి ఎందుకు పనికి రాకుండా పోయిందని మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ గ్రామానికి చెందిన రైతు రియాజ్ వాపోతున్నాడు. రైతు రియాజ్‌కు సొంత చేను లేక పోవడంతో కేస్లాగూడ శివారులో నాలుగు ఎకరాలు రూ.40 వేలకు కౌలుకు తీసుకుని యాసంగి సీజన్‌కు గాను జొన్న పంట సాగు చేశాడు. జొన్న పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా పంట తడిసి మొలకెత్తాయి. దీంతో సుమారు 30 క్వింటాళ్ల జొన్న పంట నేల పాలు అయి పనికి రాకుండా పోయిందని ఆవేదన చెందుతున్నాడు. జొన్న కర్రలను పశు గ్రాసానికి రైతులు వాడుతారు. జొన్న కర్రలు సైతం వర్షాలకు నల్లబడి పోయి పశువులకు సైతం మేతకు పనికి రాకుం డా పోయాయని రైతులు చెబుతున్నారు. అధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

గిరి సంత.. వసతుల్లేక చింత

- కొనుగోలుదారులు, వ్యాపారుల తీవ్ర ఇబ్బందులు

జైనూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎక్కువగా సంతల పైనే ఆధారపడుతూ తమకు కావాల్సిన సరకులు కొనుగోలు చేస్తుంటారు. ప్రతీ వారం నిర్వహించే సంతల్లో లక్షల రూపాయల వ్యాపారం సాగుతోంది. వీటి ద్వారా ఆదాయం గ్రామ పంచాయతీలకు సమకూరు తున్నా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంటు న్నాయి. షెడ్లు లేక పోవడంతో వ్యాపారులు పాలిథి న్ కవర్లు ఏర్పాటు చేసుకోని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగు దొడ్లు ఎక్కడా లేవు. ఫలితంగా వానాకాలంలో చాల వరకు వారసంతలు నిర్వహిస్తున్న స్థలాలు బురదమయం అవుతుండడంతో ఆవస్థలు వర్ణాతీతంగా తయారయ్యాయి. ఒక్కొక్కరి నుంచి 50 నుంచి 100 వసూలు చేస్తునా సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

ఉపాధి హామీ పథకంతో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సంతల అభివృద్ధికి నిధులు వెచ్చించే ఆవకాశం ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీటి అభివృద్ధికి రెండు విధాల అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ వాటాగా రూ. 2. 50 లక్షలు చెల్లిస్తే ఉపాధి హామీ పథకం కింద రూ. 12.50 లక్షలు చెల్లిస్తారు. దీంతో పాటు గ్రామ పంచాయతీ వాటాగా రూ. 5 లక్షలు చెల్లిస్తే రూ. 15 లక్షలను ఉపాధి హామీ పథకం కింద చెల్లి స్తారు. అధికారుల సమన్వయంతో సంతల్లో అన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంది.



జైనూర్ వారసంతలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

పంచాయతీలు ముందుకు రావడం లేదు..

వార సంతల అభివృద్ధిలో భాగంగా గ్రామ పంచాయతీల వాటా చెల్లించేందుకు ఈ అధికారులు ముందుకు రావడం లేదు. సంతల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు చెల్లించవచ్చు.గదులు మూత్ర శాలలు, మరుగుగొడ్లు నిర్మించవచ్చు.

- నగేష్, ఉపాధి హామీ ఏపీవో

మండలాల వారీగా ఇలా..

- జైనూర్ మండల కేంద్రంలో ప్రతీ గురువారం సంత కొనసాగుతోంది. మండ లంలోని లొద్దిగూడ, అడ్డెసర్, తాడిగూడ తదితర గ్రామాల ప్రజలకు రహదారి సదు పాయం లేక పోవడంతో వర్షాకాలంలో వారికి తిప్పలు తప్పడం లేదు. ఇక్కడ ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవు. జైనూర్ మండల కేంద్రంలో వార సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. షెడ్ల లేక వ్యాపారులు ఇబ్బందులు పడు తున్నారు. తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సంతకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.
- వాంకిడి మండల కేంద్రంలో ప్రతీ గురువారం చిక్లీ వాగు సమీపంలో సంత నిర్వహిస్తారు. ఇక్కడకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేక పోవడంతో వర్షాకాలంలో తిప్పలు తప్పడం లేదు. ఇక్కడ ఎటువంటి మౌలిక సదుపా యాలు లేవు.
- బెజ్జూరు మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న వార సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. మండలంలోని సలుగుపల్లిలో ప్రతీ గురువారం నిర్వహిస్తున్నారు. అక్కడా అదే పరిస్థితి నెలకొంది. షెడ్ల లేక వ్యాపారులు టార్పాలిన్లు కట్టుకుని విక్రయాలు చేసుకుంటున్నారు. తాగునీటి సదుపా యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.
- కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం వారసంత కొనసాగుతోంది. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు ఏమైంది?

- సర్వే పూర్తి చేసిన అధికారులు
- పట్టాలెక్కితే తీరనున్న పట్టణ సమస్యలు
- ఇరుకు రోడ్లలో వాహనదారుల అవస్థలు

కాగజ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అతి పెద్ద మున్సిపాలిటీ కాగజ్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ అమలుకు నోచుకోవడం లేదు. ఈ మున్సిపాలిటీలోని మాస్టర్ ప్లాన్ కోసం సర్వేలను అధికారులు పూర్తి చేశారు. కాని ఇంత వరకు అమలు కాలేదు. మాస్టర్ ప్లాన్ పట్టాలెక్కక పోవడంతో రోడ్డు విస్తరణ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత బీఆర్ఎస్ హయాంలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఢిల్లీకి చెందిన డీడీఎఫ్ కన్సల్టెంట్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో సర్వే చేయించారు.

సర్వే పూర్తి చేసిన అనంతరం ఆన్‌లైన్ మ్యాపింగ్ కూడా రూపొందించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మాస్టర్ ప్లాన్ అమలుకు అడుగులు పడలేదు. కాగా ఆరు నెలల క్రితం కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అమృత్ 2.0 మున్సిపాలిటీల్లో కూడా కాగజ్‌నగర్ ఎంపికైంది. ఈ పథకంలో భాగంగా మళ్లీ రోడ్ల విస్తరణ సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలు పూర్తి ఇప్పటికీ నాలుగు నెలలు దాటింది. రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. కానీ ఇంత వరకు మాస్టర్ ప్లాన్ అమలు కాలేదు.

వార్డుల్లో అంతర్గత రోడ్లు..

మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే 30 వార్డుల పరిధిలో అంతర్గత రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఈ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ ఎంత మేర చేపట్టాలి, అనే అంశాల పైనే ప్రధానంగా సర్వేలు పూర్తి చేశారు.



కాగజ్‌నగర్‌లో ప్రధాన మార్కెట్ రోడ్డు

కాగజ్‌నగర్ పట్టణంలో ఎంజీ రోడ్డు నుంచి నేరుగా రైల్వే కాలనీకి వెళ్లే వరకు ఇరుకు రోడ్లలో నడువ లేక మరింత ఇబ్బంది కరమైన పరిస్థితులున్నాయి. ఓ వైపు ఇరుకు రోడ్లు, మరో వైపు వాటిపై గుంతలు పడ డంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో చేపట్టే నూతన మాస్టర్ ప్లాన్ పూర్తి కాగా, ప్రస్తుతం ఉన్న జనాభాకు 2040లో ఉండే జనాభా ఎంత మేర పెరు గుతుందన్న అంశాలను చర్చించి వసతుల సౌకర్యం కల్పించేందుకు వివిధ అంశాలను రూపొందించారు. ప్రధానంగా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. మార్కెట్‌లో అంతర్గత రోడ్ల విస్తరణ, ప్రధాన కూడలిల ఆధునీకరణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.

కాగజ్‌నగర్ మున్సిపాల్టీ నుంచి పూర్తి స్థాయి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయమై టీపీవో యశ్వంత్‌ను వివరణ కోరగా మాస్టర్ ప్లాన్ కోసం సర్వేలు పూర్తి చేశామని చెప్పారు. నాలుగు నెలల క్రితం కూడా అమృత్ భారత్ 2.0 స్కీం కింద శాటిలైట్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ఉన్నతాధికారులకు పూర్తి వివరాలు అందజేశామని, ఉత్తర్వులు రాగానే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి

పెద్దపల్లి కిషన్ రావు, కాగజ్‌నగర్



మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి. పట్టణంలో ప్రధాన కూడళ్లు, ఆర్ఓబి వద్ద అంతర్గత రోడ్డు పూర్తిగా ఇబ్బందికరంగా ఉంటుంది. నిత్యం వాహనాలతో రద్దీ ఉంటుంది. ఆదివారం వచ్చిందంటే మరింత కష్టంగా ఉంటుంది. మార్కెట్‌లో కూడా వాహనాలు పోలేని పరిస్థితి ఉంటుంది. అధికారులు రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి..

గుళ్లపల్లి ఆనంద్, కాగజ్‌నగర్



మాస్టర్ ప్లాన్ అమలు చేయడం ద్వారా పట్టణ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రధాన కూడళ్లలో రోడ్ల విస్తరణ పనులు చేపడితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయి. పండగల సమయంలో మార్కెట్ రోడ్డులో తీవ్రంగా ట్రాఫిక్ జాం అవుతోంది. అధికారులు ప్రణాళిక ప్రకారం అంతర్గత రోడ్ల విస్తరణ, ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయించాలి.

జాబ్‌కార్డుదారులకు ఉపాధి పనులు

శ్రావణ్‌కుమార్, ఏపీవో



ఆంధ్రజ్యోతి: జాబ్‌కార్డు కలిగిన కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీవో: జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తున్నాం. మండలంలో మొత్తం 9,958 జాబ్‌కార్డులు ఉన్నాయి. 6,400 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 3,600 మంది కూలీలు పనులకు వస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కూలీలకు సకాలంలో డబ్బులు అందిస్తున్నారా ?

ఏపీవో: మండలంలో ఉపాధి పనులకు వచ్చిన కూలీలకు ఏప్రిల్ 15 వరకు కూలీ డబ్బులు అందజేశాం. మిగితా పనిదినాలకు సంబంధించిన డబ్బులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు కూలీలకు పనులు కల్పించడంతో పాటు వేతనాలను సైతం సకాలంలో అందజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వేతనాల చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకోకుండా ఎలాంటి చర్యలు తీసు కుంటున్నారు?

ఏపీవో: ఉపాధిహామీ కూలీలకు వేతనాల చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం. పని ప్రదేశంలో కూలీల ముఖ గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నాం. క్షేత్ర సహాయకులు కూలీల ఫొటోలు తీసే ప్రక్రియ ప్రారంభించాం.

ఆంధ్రజ్యోతి: వనమోహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయా?

ఏపీవో: వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని 28 పంచాయతీల్లో 3.50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. దీంతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటేందుకు అదనంగా లక్ష 50 వేలు మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలు ఎండిపోకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నాం.

- వాంకిడి, ఆంధ్రజ్యోతి

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి



అంబేద్కర్ గ్రంథాలను అందజేస్తున్న బీఎస్ఐ సభ్యులు

వాంకిడి, మే 25 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ ఉపాసకులకు ఆదివారం అంబేద్కర్ గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గ్రంథాలను పఠనం చేసి ఆయన ఆశ యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు ఆత్మారాం, తిరుపతి, జయరాం, శ్యాంరావు, గులబ్, మున్నా తదితరుఉల పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

నెన్నెల, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్వాయిపేట శివారులో విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఆదివారం ఉదయం మేతకు వెళ్లిన పాగాల నాగన్నకు చెందిన ఒక గేదె, జక్కుల రాజన్నకు చెందిన రెండు గేదెలు తెగిపడిన 11 కేవీ తీగలు తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందాయి. గమనించిన రైతులు అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపి వేయించారు. లేని పక్షంలో మరిన్ని పశువులకు ప్రాణ నష్టం జరిగేదని పేర్కొన్నారు. మృతి చెందిన ఒక్కో బర్రె విలువ రూ. 50 వేలు ఉంటుందని తమకు రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. తమకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. చిన్నపాటి వానకే వైర్లు తెగి పోతున్నాయని గ్రామస్థులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అదృశ్యమైన విద్యార్థి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన విద్యార్థి మృతదేహం ఆదివారం పెద్దవాగులో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ భట్టుపల్లికి చెందిన హేమంత్(16) అనే విద్యార్థి శనివారం కన్పించకుండా పోయాడు. తల్లిదండ్రులు రాత్రంతా గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం సాయంత్రం పెద్దవాగులో మృత దేహం కనిపించడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. హేమంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

ఎయి'డెడ్' పాఠశాలలు

- మూసివేతకు గురవుతున్నా పట్టింపు కరువు
- పోస్టులు భర్తీ కాకపోవడమే సమస్య
- ప్రభుత్వాలు మారుతున్నా చర్యలు శూన్యం

కాగజ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా ఎయిడెడ్ పాఠశాలలను పట్టించుకోవడం లేదు. ఎయిడెడ్ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందుతున్నారు. కొత్త వారిని నియమించే అవకాశాలను పట్టించుకోకపోవడంతో మూసివేతకు గురవుతున్నాయి. ఇప్పటికే కాగజ్‌నగర్‌లో ఓ పాఠశాల మూతబడింది. ఆయా ఎయిడెడ్ యాజమాన్యాలు తాత్కాలికంగా బోధకులకు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ కూడా మార్కెట్‌లో పోటీతత్వం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎయిడెడ్ పాఠశాలలు వరుసగా మూత బడుతున్నాయి. ఈ పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందిని ఖాళీలున్న చోట బదిలీ చేస్తున్నారు. కాని అర్హత కలిగిన వారికి ఇంత వరకు ప్రమోషన్లు కల్పించడం లేదని, పెండింగ్ సమస్యలు కూడా పరిష్కరించడం లేదని ఎయిడెడ్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యా యులు వాపోతున్నారు. పోరాటాలు చేసినప్పటికీ కూడా ప్రయోజనం లేకుండా పోయిందని నిరాశ చెందుతున్నారు.

జిల్లాలో దయనీయం..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న ఏడు ఎయిడెడ్ స్కూళ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఎయిడెడ్ పాఠశాలలు విద్యార్థులు, ఉద్యోగులు లేక ఇప్పుడు పూర్తిగా బోసి పోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 23 ఎయిడెడ్ పాఠశాలలుండగా, ఒక్క కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనే ఏడు ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో నూతన నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. ఓ వైపు ఉన్న ఉపాధ్యాయులంతా పదవీ విరమణ పొందుతు న్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందక పోవడంతో కొత్త విద్యార్థులు చేరడం లేదు. తద్వారా పూర్తిగా మూసివేసితకు గురవుతున్నాయి. నాలుగేళ్ల క్రితం కాగజ్‌నగర్‌లోని బాలవిద్యామందిర్ పాఠశాల విద్యార్థులు, కొత్త ఉపాధ్యాయులు రాక పోవడంతో పూర్తిగా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఏడు ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కాగజ్‌నగర్‌లో మూడు పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలు కూడా బాల భారతి, శిశుమందిర్, అన్వర్ హైస్కూల్ ఉన్నాయి. 1954లో ప్రారంభించిన బాలవిద్యామందిర్ పాఠశాల మాత్రం ఘనమైన చరిత్ర ఉంది. సిర్పూరు పేపర్ మిల్లు ఉండడంతో స్థానికేతరులు అధికంగా రావడంతో హిందీ పాఠశాల ఆవశ్యతక ఏర్పడింది. ఆ సమయంలో ఎస్పీఎం యాజమాన్యం సౌజన్యంతో బాలవిద్యామందిర్ పాఠశాలను ప్రారంభించారు. అధికారికంగా 1954లో ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపు వచ్చింది. ప్రారంభించిన సమయంలో 23 మంది ఉపాధ్యాయులు, 900 మంది విద్యార్థులతో కళకళలాడేది. కానీ ఒక్కొక్క ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. దీంతో కాలక్రమేణ ఉపాధ్యాయుల పూర్తిగా లేకుండానే పోయింది. దీంతో నాలుగేళ్ల క్రితం మూసివేశారు. ఇదే తరహాలో పట్టణంలోని పలు పాఠశాలల పరిస్థితి ఉంది. కొత్త నియామకాలు చేపట్టేందుకు అనుమతులు లేక పోవటంతో ఎయిడెడ్ పాఠశాలలు ఒక్కొక్కటి మూసివేతకు గురవుతున్నాయి. ఎయిడెడ్ పాఠశాల్లో పని చేస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులకు నెల వారీ జీతాలు సక్రమంగా రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ జీతాల విషయంలో మాత్రం తమకు పూర్తిగా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆయా పాఠశాలల్లో పని చేసే సిబ్బంది చెబుతున్నారు. నెలల తరబడి తమకు జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాగజ్‌నగర్‌లో మూతపడిన బాలవిద్యామందిర్ పాఠశాల

ప్రభుత్వం చొరవ చూపాలి..



ఎయిడెడ్ పాఠశాలపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి. కొత్తగా సిబ్బందిని తీసుకోకపోవడంతో ఎయిడెడ్ పాఠశాలలు పూర్తిగా మూసివేతకు గురి అవుతున్నాయి. దీంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. జీతాల సమస్య కూడా ఉంది. తమ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు కల్పించాలి. పాఠశాలలు పునఃప్రారంభం కాక ముందే ముందస్తు తీసుకుని న్యాయం చేయాలి.


- చొక్కారావు, ఎయిడెడ్ పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు

ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తా

చింతలమానేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సు కోసం ఎంతకైనా తెగిస్తానని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. డబ్బా, కొత్తగూడ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి కోనేరు అభిమానుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ పార్టీలో తాను చేరానని అన్నాను. ఒక్క పని కూడా చేయడం లేదని ఇప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి, తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను స్వతంత్రంగానే బరిలో నిలుపుతామని అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పని చేసినప్పుడే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పని చేయడం లేదన్నారు. కొందరు నాయకులు హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చి రాజకీయం చేస్తున్నారని, వారిని త్వరతోనే ప్రజలు మళ్లీ హైదరాబాద్ పంపుతారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస న్న హరికృష్ణ మాట్లాడుతూ కోనప్పకు అభివృద్ధి చేయడం, అన్నం పెట్టడం, విద్యార్థులకు మంచి విద్య అందించడం తెలుసని అన్నారు. ఆయనకు తన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో చింతలమానేపల్లి, కౌటాల, బెజ్జూరు మండలాల కోనేరు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మునీర్ మృతి తీరని లోటు

సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మృతి తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్‌గా, పలు సమాజహిత ఉద్యమాలలో మునీర్ కీలక భూమిక పోషించారని గుర్తుచేసుకున్నారు. సింగరేణి మాజీ ఉద్యోగి, ప్రముఖ పాత్రికేయుడు మృతి పాత్రికేయరంగానికి తీరని లోటు అని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచందర్ రావు, ప్రధాన కార్యదర్శి భూపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి సంతాపం తెలియజేస్తూ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ నివాళులు అర్పించారు.. తెలంగాణ మలి దశ ఉద్యమంలో సీనియర్ పాత్రికేయుడు మునీర్ ప్ర ముఖ పాత్ర పోషించారని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. హెచ్ ఎం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి మునీర్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

భూమి సేకరించకుండా అవస్థలు



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రామారావుపేట రైతులు

జైపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): రామారావుపేట శివారులోని 129 ఎకరాలను ఇందారం ఓపెన్‌కాస్టు డంప్ యార్డు కోసం భూమి సేకరించకుండా సింగరేణి యాజమాన్యం తమను అవస్థలకు గురి చేస్తోందని రామారావుపేట గ్రామానికి చెందిన రైతులు జిట్ట దేవయ్య, ముదం రమేష్, నామాల తిరుపతి, జంగిలి యాదగిరి, పూదరి సత్తయ్యలు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ 2020లో నోటిఫికేషన్ ఇచ్చారని, 2022లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి ఇప్పటికి భూమిని సేకరించకుండా సింగరేణి యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని వాపోయారు. శనివారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్‌ను కలిసి సమస్యలను విన్నవించి వినతి పత్రం అందజేశామన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి ఏదో విషయం తేల్చకపోతే ఇందారం ఓపెన్‌కాస్టు ఓబీ వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిరుపేదకు ఇంటి నిర్మాణానికి యువత సాయం



నగదు అందజేస్తున్న కుర్మగూడెం యువకులు

నెన్నెల, మే 25 (ఆంధ్రజ్యోతి): నిలువ నీడ లేని పరిస్థితిలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి గ్రామ యువత అండగా నిలిచారు. విరాళాలు సేకరించి ఇంటి నిర్మాణం కోసం రూ. 1.15 లక్షల నగదు అందజేశారు. కోనంపేట పంచాయతి పరిధిలోని కుర్మగూడం గ్రామానికి చెందిన అల్ల గట్టయ్య (57)కు గొర్రెల పెంపకమే జీవనాధారం. భార్య ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు ఉన్నారు. రెండేళ్ల కిందట గట్టయ్య కిడ్నీ వ్యాధిబారిన పడ్డాడు. ఆస్తులు అమ్మి వైద్యం కోసం లక్షలు ఖర్చు చేసినప్పటికి నయం కాలేదు. తుదకు రెండు కిడ్నీలు వైఫల్యమై ఇటీవల మృతి చెందాడు. తలదాచుకోవడానికి వారికి ఈత కమ్మల గుడిసె ఉండగా అది కూలిపోయింది. ఇళ్లు కట్టుకోవడానికి ప్రస్తుతం చేతిలో చిల్లి గవ్వ లేదు. విషయం తెలుసుకున్న యువకులు వారి దైన్యస్థితిని వివరిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా విరాళాల కోసం అభ్యర్థించారు. కులపెద్దలు, దాతలు స్పందించి తోచినంత పంపించారు. పోగైన డబ్బులను బాధిత కుటుంబానికి ఆదివారం అంద జేశారు. గతంలో కరోనాతో మృతి చెందిన మారయ్య కుటుంబానికి రూ. 63 వేలు, అనారోగ్యంతో చనిపోయిన కడారి రాజయ్య కుటుంబానికి రూ. 1.16 లక్షలు అందజేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ అక్కడి యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కార్పొరేటర్లకు కొమ్ము కాస్తున్న బీజేపీ

బెల్లంపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు బీజేపీ ప్రధాని నరేం ద్ర మోదీ ప్రభుత్వ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణం లోని సీపీఐ 21వ మహాసభల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోడీ కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తూ ముందుకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. కార్మికుల తరుపున, ప్రజా సమస్యల పరిష్కారాల తరుపున భారత కమ్యూనిస్టు పార్టీ అలుపెరుగని పోరాటాలు చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఎన్నో విప్లవాలకు, ప్రజలను చైతన్యపరచడంలో సీపీఐ ముందుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వినీతిని వెలికితీసి అక్రమాలకు పాల్పడిన వారిని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. అంతకు ముందు పాతబస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీపీఐ నాయకులు భారీ ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, ఆడెపు రాజమౌళి, లక్ష్మీనారాయణ, చంద్రమాణిక్యం, బొల్లం పూర్ణిమ, దాగాం మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేణి శంకర్

రోగుల సంఖ్య పెరిగింది

లహరి, హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు



ఆంధ్రజ్యోతి : ఆసుపత్రిలో రోగులకు సేవలు ఎలా ఉన్నాయి?

వైద్యురాలు : పీహెచ్‌సీలోకి రోజు రోజు రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో రోజు 20 వరకు ఓపీలు ఉంటే ప్రస్తుతం 50 వరకు చేరింది. రోజు 10 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. మూత్ర, రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రస్తుత వ్యాధులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యురాలు : జన సంచారం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. జ్వరం, దగ్గు, జలుబు, ఆయాసం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. పరిశుభ్రత పాటించాలి. వేడి చేసి చల్లార్చిన గోరు వెచ్చని నీటిని తాగాలి.

ఆంధ్రజ్యోతి: వచ్చే వానాకాలం సీజన్‌కు ముందస్తు ఏర్పాట్లు చేశారా...?

వైద్యురాలు : ప్రస్తుతం కురుస్తున్న అన్ సీజనల్ వర్షాలకు వాతావరణం మార్పుతో ఎక్కువ మందికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి లాటి సమస్యలు వస్తున్నాయి. వారికి ఇన్‌పేషెంట్ రూపంలో బెడ్లపై చికిత్స చేసి పంపిస్తున్నాం. వచ్చే సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే ప్రతి శుక్రవారం డ్రై డే లాంటి ప్రోగ్రామ్స్ చేస్తూ, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా...?

వైద్యురాలు : ముల్కల్ల, నస్పూర్‌లకు ఏఎన్ఎంలు లేకపోవడం కొంత ఇబ్బంది కలిగిస్తోంది. రోజు వారి గ్రామంలో వైద్య సేవలకు కష్టతరంగా ఉంది.

-హాజీపూర్, (ఆంధ్రజ్యోతి)

భక్తజన ప్రభంజనం

పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

- కిక్కిరిసిన కాళేశ్వర ముక్తీశ్వరాలయం
- 11వ రోజు 3.50 లక్షల మంది పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 25 (ఆంధ్రజ్యోతి): పుష్కర స్నానాలతో భక్తులు పులకించి పోతున్నారు. కనీవినీ ఎరగని రీతిలో అంచనాలకు మించి సరస్వతి పుష్కరాలకు భక్తులు బారులు తీరారు. ఆదివారం 11వ రోజు పుణ్యసానాలు ఆచరించడానికి వచ్చిన భక్త జన సందోహంతో కాళేశ్వర క్షేత్రం కళకళలాడింది. స్నానమాచరించే ఘాట్లతో పాటు ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్ సమస్య యథావిధిగానే పునరావృతమైంది. నియంత్రణ చర్యలు చేపట్టడంలో పోలీసుశాఖ వైఫల్యాన్ని చవిచూడాల్సి వచ్చింది. వాహనాల అస్తవ్యస్తంతో పాటు భక్తుల ఇక్కట్లను తెలుసుకున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా జిల్లా పోలీస్‌బాస్‌పై మంత్రి మండిపడి వారి వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. సుమారు 3.50 లక్షల మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేశారు.



కాళేశ్వర,ముక్తీశ్వర ఆలయం విద్ద భక్తుల రద్దీ

- నేడు చివరి ఘట్టం

సరస్వతి పుష్కరాల చివరి ఘట్టం సోమవారంతో ముగియనుంది. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీతో 12 రోజులతో పరిసమాప్తి కానుంది. చివరి రోజు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో భక్తులు మరింత భారీగా తరలి వచ్చే అవకాశాలున్నట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. ఆదివారమే చాలా మంది కాళేశ్వర క్షేత్రానికి చేరుకున్నారు. ఇక్కడ బస చేసి సోమవారం దర్శించుకునేలా కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.



- ట్రాఫిక్ సమస్య తీవ్రం

పుష్కరాలకు వచ్చి వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తింది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు15 కిలోమీటర్ల నిడివిలో ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు ఆలస్యంగా తేరుకొని ఔట్ గోయింగ్ బస్సులు, కార్లను పూస్కుపల్లి మీదుగా మళ్లించినప్పటికీ అటు కూడా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో భక్తులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకపోయారు. గంటల కొద్ది వాహనాలు కదలకపోవడంతో అందులో ప్రయాణిస్తున్న భక్తులు ఆకలి, దప్పికతో అలమటించి పోయారు. కాళేశ్వరం వచ్చివెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ సమస్య కారణంగా ఆర్టీసీ బస్సులు, కార్లలోనే గంటల తరబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలకు మహదేవపూర్ చేరుకున్న వాహనాలు సాయంత్రం 5 గంటల వరకు కూడా కాళేశ్వరానికి చేరుకోలేకపోవడంతో అనేక అవస్థలు పడ్డారు.

- వైభవంగా నవరత్నమాల హారతి

కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని 11వ రోజైన ఆదివారం రాత్రి 7.00 గంటల నుంచి 7.45 గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో పలు అష్టకాలతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సీఎంవో కార్యదర్శి శ్రీనివాసరాజు హాజరయ్యారు.


హారతినిస్తున్న కాశీ పండితులు


కిక్కిరిసిన కాళేశ్వరం దారి

బూటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ అలియాస్ కేశవరావుతో పాటు 540 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని, ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథ్, అంజన్న, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న కుమార్‌లు పేర్కొన్నారు.

ఆదివారం చెన్నూరులోని నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 2026 మార్చి కల్లా మావోయిస్టు పార్టీ నిర్మూలిస్తామని ప్రకటించి మరీ ప్రభుత్వం జరుపుతున్న ఆపరేషన్ కగార్‌లో భాగంగా నిరాయుధవంగా ఉన్న పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ అలియాస్ నంబళ్ల కేశవరావుతో పాటు 27 మందిని ఎన్‌కౌంటర్ చేసి చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 28న చెన్నూరు పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సదస్సు నిర్వహిస్తామని, ఈ సదస్సుకు ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పోచమల్లు, జాడి దేవరాజ్, కాంతయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎస్టీపీపీ కొత్త యూనిట్‌కు.. రాజకీయ గ్రహణం

(5వ పేజీతరువాయి)

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సన్నిహితుడు కావడం, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానందకు ప్రేంసాగర్‌రావుతో మంత్రి పదవి విషయంలో అభిప్రాయ బేధాలు ఉండడంతో ఇద్దరూ కొంతకాలంగా ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. మంత్రుల పర్యటన సందర్భం గానూ ఒకరి నియోజక వర్గంలో మరొకరు అడుగు పెట్టడంలేదు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా మూడో యూనిట్ శంకుస్థాపన చేయిస్తే... భవిష్యత్తులో ఎస్టీపీపీలో ప్రేంసాగర్‌రావు ఉనికిని చా టుకునే అవకాశాలు ఉండడంతో నేరుగా సీఎంతోనే శంకుస్థాపన చేయించాలనే ఉద్దేశ్యంతో వివేకానంద ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఎస్టీపీపీ మూడో యూనిట్ శంకుస్థాపనలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్టీపీపీలో కొత్త యూనిట్‌ను విస్తరిస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగనున్నాయి. మూడో యూనిట్‌కు అవసరమైన మరో 1200 మందికి కొత్త ఉద్యోగాలు లభిం చనున్నాయి.

ఎంపీని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

వేమనపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో జరుగుతున్న పుష్కరాల ప్రారంభానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ను ఆహ్వానించకుండా అవమానించారని నేతకాని హక్కుల పోరాట చైతన్య సమితి మండల అధ్యక్షుడు ఎన్నం సంజయ్ పేర్కొన్నారు. ఆదివారం వేమనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఎంపీ వంశీకృష్ణను పుష్కరాలకు ఆహ్వానించకపోవడం, ఎక్కడా ఎంపీ ఫోటోలు పెట్టకపోవడం దారుణమన్నారు. దళిత ఎంపీ అయినందునే కుల వివక్ష చూపి ఆహ్వానించలేదన్నారు. దళిత ఎంపీ అయిన వంశీకృష్ణను అవమానించిన వారిపై కాంగ్రెస్ అధిష్టానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు దుర్గం శ్రీనివాస్, వినోద్, రమేష్ పాల్గొన్నారు.

సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

గోదావరిఖని, మే 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 అధికారులతో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం స్థానిక ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎం లలిత కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగరరావు

మంచిర్యాల కలెక్టరేట్, మే25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూనియర్, సబ్‌జూనియర్ యూత్‌లేవల్ బాలికల టైసన్‌కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 23 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాను శాస్వత నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా మంచిర్యాల జిల్లాను క్రీడారంగంలో రాష్ట్ర స్థాయిలో అభివృద్ధివైపు తీర్చిదిద్దుతామన్నారు. త్వరలోనే జిల్లా లో అన్ని క్రీడలు వేదికలు నిర్వహించేందుకు ఇండోర్ స్టేడియంను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు విద్యా, వైద్యంతోపాటు అన్ని కలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు మంచిర్యాల నియోజకవర్గ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిత్తాపూర్‌లో పీఎం మన్‌కీబాత్ ప్రదర్శన

నెన్నెల, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీబాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆదివారం చిత్తాపూర్ బీజేపీ కార్యకర్తలు వీక్షించారు. ప్రతి నెలాఖరు ఆది వారం నిర్వహించే ఈ కార్యక్రమంలో నెల రోజుల పాటు దేశంలో చేపట్టిన కార్యక్రమాల గూర్చి ప్రజలతో ప్రధాని పంచుకుంటారని నాయకులు చెప్పారు. మన్‌కీబాత్ కార్యక్రమంతో పీఎం ప్రజలకు మరింత చేరువయ్యారని అన్నారు. సామాన్యులతో అనుబంధాలు, వారి కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌గౌడ్, మండల ఇన్‌చార్జీ చిలువేరు శేషగిరి, నాయకులు కూనారపు రాజన్న, గుండ్లపెల్లి రాజన్న పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని బీజేపీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వేమనపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) : నీల్వాయి గ్రామంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ ఆదివారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డు మంజూరైనా అధికా రులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల నిర్మాణం పూర్తి కాలేదన్నారు. గతంలో బీజేపీ చేపట్టిన నిరసన వల్ల గుత్తేదారు కొత్తగూడెం నుంచి నీల్వాయి వరకు రోడ్డు వేశారన్నారు. నీల్వాయి గ్రామంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా సింగిల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని, ఇందు కోసం రోడ్డును తవ్వి ఎర్ర మట్టి పోయడంతో వర్షాలకు రోడ్డంతా బురదమయంగా మారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు అజయ్‌కుమార్, చరణ్ రాజ్, స్వామి, రమేష్‌గౌడ్, ప్రశాంత్, పోచయ్య, రవి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మంచిర్యాల జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూరులోని శార్వాణీ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఏడుగురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొంది ఏడు బంగారు పతకాలు, మూడు సిల్వర్, ఒక కాంస్య పథకాలు సాధించారు. జూన్ 1న హైద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారని తెలిపారు. విద్యార్థులను కరెస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీజన్, స్వామి, సంతోష్, స్రవంతి, శ్రావణిలు అభినందించారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలు

లక్షెట్టిపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందజేసే పాఠ్య పుస్తకాలు స్థానిక విద్యా వనరుల కేంద్రానికి శనివారం సాయంత్రం చేరుకున్నాయి. మండలంలో మొత్తం 57పాఠశాలలు ఉండగా అందులో సుమారు 4285 మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం పాఠ్య పుస్తకాలతో పాటు రెండు జతల స్కూల్ యూనీఫాం కూడా ఇస్తారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం క్లాత్ మండలానికి ప్రభుత్వం కేటాయించగా మెప్మా, మహిళా సంఘాల సభ్యులు యూనిఫాం విద్యార్థుల సైజుల వారిగా కుడుతున్నట్లు సమాచారం. ఈఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఇప్పటికే పలు కార్యక్రమాలను చేపడుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



మంచిర్యాలలో జ్యోతి ప్రజ్వళన చేస్తున్న అధ్యాపకులు

శ్రీరాంపూర్, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని కొత్త రోడ్డుకు చెందిన లక్ష్మీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-24 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●శ్రీరాంపూర్‌లోని శారదా శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.

మంచిర్యాలక్రైం: కృషి ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ 1992-94 విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

●అభినవ విద్యాసదన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు 2001-2002 విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

వేమనపల్లి : నీల్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనంగా ఏర్పడ్డారు.



కోటపల్లిలో 1983-84 పదో తరగతి పూర్వ విద్యార్థులు



2003-24 శిశుమందిర్ ఉన్నత పాఠశాల పదో తరగతి పూర్వవిద్యార్థులు



నీల్వాయిలో 2006-07 ఎస్సెస్సీ పూర్వ విద్యార్థుల



మంచిర్యాలలో 2001-2002 అభినవ విద్యాసదన్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



ఆకాశం ఎందుకో.. ఎర్రబడ్డది

ఆకాశానికి సిందూరం పూసినట్లు.. నీలాకాశంలోని మేఘాలకు రంగులు అద్దినట్లుగా కనిపిస్తున్న ఈ దృశ్యం ఆదివారం తెల్లవారుజామున దండేపల్లి మండల కేంద్రంలో దర్శనమిచ్చింది. వేసవికాలంలో భగభగమంటూ నిప్పులు కక్కే సూర్యుడు తెల్లవారుజామున ఆకాశానికి ఎర్రటి రంగును పులిమాడు. గుట్టల మధ్య నుంచి సూరీడు మెరుస్తూ ఉదయిస్తున్న చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- దండేపలి (ఆంధ్రజ్యోతి)

ఎస్టీపీపీ కొత్త యూనిట్‌కు రాజకీయ గ్రహణం

- ఒప్పందం పూర్తయినా శంకుస్థాపనకు నోచుకోని వైనం
- డిప్యూటీ సీఎం చేతులమీదుగా ప్రారంభానికి అయిష్టత..?
- పస్తుతం 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- మరో 800 మెగావాట్ల యూనిట్‌కు సింగరేణి సన్నద్ధం



మంచిర్యాల, మే 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి వద్ద ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో కొత్త యూనిట్ శంకుస్థానకు రాజకీయ గ్రహణం పట్టింది. కాంట్రాక్టర్‌తో ఒప్పందం పూర్తయినా పనులు ప్రారంభించేందుకు మాత్రం నోచుకోవడంలేదు. దీనికి రాజకీయ అనిశ్చితే కారణమనే విమర్శలు ఉన్నాయి. సింగరేణి సంస్థ తొలిసారిగా 2016 జనవరిలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎస్టీపీపీలో తొలుత 600మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించడం లక్ష్యంగా పెట్టుకోగా, అనతికాలంలోనే మరో 600 యూనిట్లను విస్తరించి మొత్తం 1200 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధిస్తోంది. సంస్థ ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ నుంచి తన సొంత అవసరాలకు 150 మెగావాట్లు వినియోగించుకుంటుండగా, మిగితా 1050 మెగావాట్ల విద్యుత్‌ను జెన్‌కో ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయిస్తోంది.

● అందుబాటులో వనరులు...

విద్యుత్ ఉత్పత్తిని సాధించడం కోసం ప్రధానంగా అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులో ఉండడంతో ఎస్టీపీపీని ఏర్పాటు చేయగా, సుమారుగా రెండు వేల ఎకరాల భూములను సంస్థ రైతుల నుంచి సేకరించింది. 2015 సంవత్సరాంతంలో విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనే లక్ష్యంతో 2011లో కాంట్రాక్టు అవార్డు చేయడంతో పాటు 2012 సంవత్సరంలో అభివృద్ధి పనులను సంస్థ ప్రారంభించింది. రూ.7,573 కోట్ల అంచనా వ్యయంతో (రెండుయూనిట్లు) 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ పనులు పూర్తి చేయగా మరో రూ.6,700కోట్ల అంచనా వ్యయంతో మూడో యూనిట్ 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

● గోదావరి నీరు తరలింపు

మొట్ట మొదటిసారిగా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన పెగడపల్లి సింగరేణి పవర్ ప్రాజెక్టుకు అవసరమైన మూడు టీఎంసీల నీటిని గోదావరి, ప్రాణహిత నదుల నుంచి తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. గోదావరి నది నుంచి షెట్‌పల్లి, గంగిపల్లి, ఎల్కంటి, పెగడపల్లి శివారుల మీదుగా ప్లాంట్ ఆవరణలో నిర్మించిన రిజర్వాయర్‌వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. మిగితా 2 టీఎంసీల నీటిని కోటపల్లి మండలం దేవులవాడ శివారు ప్రాణహితనది నుంచి తరలించడం కోసం ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమై బొగ్గును శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు నుంచి తరలించేందుకు సంస్థ ప్రత్యేక రైలుమార్గాన్ని కూడా ఏర్పాటు చేసింది.

● ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ

ఎస్టీపీపీలో మూడో యూనిట్ ఏర్పాటుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కూడా పూర్తికాగా, త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు యాజమాన్యం హైద్రాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ సంస్థతో మూడు నెలల క్రితం ఒప్పందం చేసుకుంది. గత ఫిబ్రవరిలోనే ఈ కాంట్రాక్ట్‌ను బీహెచ్‌ఈఎల్ దక్కించు కోగా, అగ్రిమెంట్ పూర్తయిన నాటి నుంచి నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంది. అందుకు భిన్నంగా 40నెలల్లోనే ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది.

● శంకుస్థాపనలో తీవ్ర జాప్యం

ఎస్టీపీపీలో ఏర్పాటు చేయదలిచిన మూడో యూనిట్ విద్యుత్ ఉత్పత్తి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు 2024మార్చి 12న హైద్రాబాద్‌లో భట్టి ప్రకటించారు కూడా. స్థానికంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితి కారణంగా డిప్యూటీ సీఎంతో కాకుండా నేరుగా ముఖ్యమంత్రితోనే శంకుస్థాపన చేయించాలనే ఆలోచ నలు చేస్తున్నట్లు సమాచారం. భట్టి విక్రమార్కకు...

మిగతా 7లో

ఈసెట్ ఫలితాల్లో బెల్లంపల్లి విద్యార్థుల సత్తా

- రాష్ట్ర స్థాయిలో 1, 3, 4 ర్యాంకులు సాధించిన విద్యార్థులు

బెల్లంపల్లి, మే25(ఆంధ్రజ్యోతి): ఈ సెట్ 2025 పరీక్షఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆయా విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంక్‌లు సాధించి సత్తాచాటారు.

తల్లిదండ్రుల, అధ్యాపకుల కృషితో..

-అక్షయ, రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకర్



ఈ సెట్ మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో కుర్మ అక్షయ మొదటి ర్యాంక్ సాధించింది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలానికి చెందిన కుర్మ అనిల్ కుమార్ లావణ్య దంపతుల కుమార్తె అక్షయ బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ రావడానికి బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే మంచిర్యాంక్ సాధించినట్లు తెలిపింది. జాతీయ స్థాయిలో గేట్ పరీక్షల్లో ఉత్తమర్యాంక్ సాధించి సింగరేణి, కోలిండియాలాంటి మైనింగ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించాలనేది లక్ష్యంగా ముందుకు వెళ్తాను. సింగరేణి మైనింగ్ విభాగంలో పురుషులు మాత్రమే చేయగలుగుతున్న విధులను మహిళగా పట్టుదలతో శ్రమించి పురుషులకు దీటుగా విధుల్లో రాణిస్తాను.

కష్టపడి చదివి లక్ష్యం సాధించాను..

-పి. వర్షిత్, 3వ రాష్ట్రస్థాయి ర్యాంకర్



2025 ఈసెట్ ఫలితాల్లో మైనింగ్ ఇంజనీరింగ్ విభాగంలో వర్షిత్ 3వ ర్యాంక్ సాధించి సత్తాచాటాడు. మాది హనుమకొండ జిల్లా ఉప్పల్ గ్రామం. మా తల్లిదండ్రులు చంద్రమోహన్ అరుణ నేను బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లోమా చదివి ఈసెట్ పరీక్షలు కష్టపడి రాసాను ఎంతో దూరం నుంచివచ్చి బెల్లంపల్లిలో ఎలాగైన రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించాలని పరీక్షలు రాసి విజయం సాధించాను. గేటు పరీక్షలు రాసి ఐఐటీ విభాగంలో మైనింగ్ ఇంజనీరింగ్‌లో మెరిట్ సాధించి మైనింగ్ పీహెచ్‌డీ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తాను.

తల్లిదండ్రుల కష్టానికి ఫలితం దక్కింది..

-వడ్లకొండ మారుతిసాయి, 4వర్యాంకర్



ఈసెట్ రాష్ట్రస్థాయి ఇంజనీరింగ్ విభాగంలో మారుతిసాయి 4వర్యాంక్ సాధిం చాడు. మాది పెద్దపల్లి జిల్లా మా తండ్రి జనార్ధన్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ నన్ను ఎంతో కష్టపడి చదివించాడు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లోమా పూర్తి చేసి ఈసెట్ పరీక్షలు రాశాను. మా పాఠశాలలో అధ్యాపకులు అదనపు శిక్షణ తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేశారు. కోలిండియా లిమిటెడ్ మైనింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తాను.

మాజీ ఎమ్మెల్యే అసమర్ధతతోనే మంచిర్యాల వెనుకబాటు

- అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరం
- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, మే25(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల అన్ని విధాలుగా వెనుకబాటుకు దివాకర్‌రావు అసమర్థత పాలనే అని ఆయన అభివృద్ధి గురించి మాట్లాడడం విడ్డూరం గా ఉందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలనలో చేతకాని దివాకర్ రావు అభివృద్ధిని ఓర్వలేక విమర్శించడం సరికాదన్నారు. మంచిర్యాలలో విద్యా, వైద్యసేవలు విస్తృత పరుస్తూ రహదారులు విస్తరింపచేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తన ఇంటి ముందు రైల్వే ఓవర్‌బ్రిడ్జీ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగడం మాజీ ఎమ్మెల్యే సహించలేక పోతున్నారన్నారు.

వేంపల్లిలో పరిశ్రమల నిలయం ఏర్పడడం ఆయనకు కంటగింపుగా ఉందన్నారు. ఐటీ పార్కును అడ్డగిస్తాననడం అభివృద్ధి నిరోధకమే అ న్నారు. ఐటీ పార్కు అయితే వందలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తుందని గుర్తు చేశారు. భూనిర్వాసితులకు సంతోషకరమైన ప్యాకేజీ ఇస్తానని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే కుమారుడు విజిత్ రావు గురించి ప్రజలకు తెలిస్తే నీ పరిస్థితి ఎలా ఉంటుందో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎన్ని విమర్శలు చేసిన, ఎన్ని ఆరోపణలు చేసిన మంచిర్యా లను విద్యా, వైద్యపరంగా అభివృద్ధి చేసి తీరుతాన న్నారు. ఎల్లంపల్లి భూనిర్వాసితులకు ఎంత వరకు న్యాయం చేశావో బహిరంగంగా తెలుపాలని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఇందిరమ్మ రాజ్యమేఅని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో తమ ప్రభు త్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి, తాజా మాజీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతి

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూత



ఎండీ మునీర్(ఫైల్)

మంచిర్యాల కలెక్టరేట్, మే25 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్టు మునీర్(60) చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. హైదరాబాద్ ఒమెగా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన ఆయన పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. మునీర్ మరణ వార్త తెలియగానే పలువురు పాత్రికేయులతో పాటు కార్మికులు, సింగరేణి ప్రాంతానికి చెందిన పలువురు వేలాది మంది వచ్చి పూలమాలలతో ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమకాలంలో సింగరేణి జేఏసీ కన్వీనర్‌గా వ్యవహరించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రొఫెసర్ కోదండరాం నివాళులు అర్పించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయుసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు సెక్రటరీ జనరల్ కనీస వేతనాల బోర్డు చైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఏనుగు రవీందర్ రెడ్డి నివాళులు అర్పించారు.

టీయుడబ్ల్యుజే(ఐజేయు) జిల్లా అధ్యక్షులు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి మునీర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ నివాళులు అర్పించారు.

మంచిర్యాలక్రైం: అలుపెరుగని కమ్యూనిస్టు కలం యోధుడు అమర జీవి కామ్రేడ్ మునీర్ అని అఖిలభారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయు) జాతీయ కార్యదర్శి సబ్బని క్రిష్ణ మునీర్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. మునీర్ అన్న మహోన్నతమైన మంచి కమ్యూనిస్టు అని బొగ్గుగని కార్మిక వర్గానికి, రైతాంగానికి, పత్రిక రంగానికి అన్ని వర్గాల ప్రజలకు ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు.

మంచిర్యాలక్రైం: సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మృతి పత్రికరంగానికి తీరనిలోటని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం తన నివాసంలో ఎండీ మునీర్ మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటని పత్రిక రంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

లక్షెట్టిపేట(దండేపల్లి): సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి ఆదివారం దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సభ్యులు సంతాపం తెలిపారు.

మందమర్రిలో అంత్యక్రియలు..

మందమర్రి టౌన్ : సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నేత ఎండీ. మునీర్(69) అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం కేకే-1 సబ్ స్టేషన్ సమీపంలోని కబ్రస్థాన్‌లో నిర్వహించారు. బెల్లంపల్లిలో పుట్టి పెరిగిన ఆయన అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం 1981 ప్రాంతంలో సింగరేణిలో కేకే-1 గనిలో బదిలీ వర్కర్‌గా విధుల్లో చేరారు. మునీర్ ఆంధ్రజ్యోతి పత్రికలో మూడు దశాబ్దాల పాటు పని చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహం డోలాను పెద్దపల్లి ఎంపీ మోశారు. ఈ అంత్యక్రియలకు పలువురు తరలివచ్చారు.

ట్రాఫిక్‌తో భారీగా నిలిచిన వాహనాలు



భీమారంలోని జోడు వాగుల ప్రాంతం వద్ద నిలిచిన వాహనాలు

భీమారం, మే 25 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండలంలోని జోడు వాగుల ప్రాంతంలో ఆదివారం ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. టాటా ఏస్ వాహనంలో బురదలో కూరుకుపోవడంతో మంచిర్యాల నుంచి చెన్నూరు వైపు చెన్నూరు నుంచి మంచిర్యాలకు వెళ్లే వాహనాలన్నీ గంటల తరబడి నిలిచిపోయాయి. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేరే ప్రాంతం నుంచి ధాన్యం తీసుకొచ్చి అమ్ముతున్నారు

చెన్నూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తెరసాల గ్రామపంచాయతీ పరిధిలోని సుబ్బరాంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ధాన్యాన్ని అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. చెన్నూరు పట్టణానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు సుబ్బరాంపల్లిలో తనకున్న భూమిలో పండించిన ధాన్యంతో పాటు కోటపల్లి మండలం జనగామ గ్రామం నుంచి ధాన్యం బస్తాలను తీసుకువచ్చి ఇక్కడి కేంద్రంలో అమ్ముతున్నాడన్నారు. ధాన్యాన్ని లారీలో లోడ్ చేసే సమయంలో రైతులు అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతుల పేర్ల మీదనే ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రైతులు తెలపడంతో లారీని విడిచిపెట్టారు.

ఇప్పుడే ఇలా..వర్షాకాలం ఎలా..?

- కాసేపు వర్షానికే లక్షెట్టిపేట అస్తవ్యస్తం
- నిండిన డ్రైనేజీలు, ఇండ్లలోకి మురికినీరు
- ఇబ్బంది పడ్డ ప్రజలు



లక్షెట్టిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షపునీరు



కరీంనగర్ చౌరస్తాలో నిలిచిన వర్షపునీరు

లక్షెట్టిపేట, మే 25(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణం రోజు రోజుకూ అభివృద్ధిలో అధ్వానంగా మారుతోంది. పన్నువసూలు చేయడంలో రాష్ట్రంలో ముందంజలో ఉన్నా ప్రజలకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రోజు రోజుకూ మున్సిపాలిటీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారు తోంది. కాసేపు పడిన వర్షానికే రోడ్లపై నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రజలకు నానాఇబ్బంది పడుతున్నారు. ము న్సిపాలిటీలో మొత్తం 15వార్డులు ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం కాసేపు కొట్టిన వర్షానికే పలు వార్డుల్లోని డ్రైనేజీలు నిండి ఇళ్లలోకి నీరు చేరాయి. గంట సేపు కురి సిన వర్షానికే పరిస్థితి ఇలా అయితే మరి రానున్నది వర్షాకాలం ఎలా ఉంటుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది అధిక వర్షాలు కురిసే అవ కాశం ఉందని వాతావరణశాఖ సూచిస్తోంది. అదే నిజమైతే మన లక్షెట్టిపేట పరిస్థితి ఏంటా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బస్టాండ్‌లో నిలిచిన నీరు.. ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

పట్టణ మున్సిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు ఊత్కూర్ చౌరస్తా, కరీంనగర్ చౌరస్తా ఎప్పుడు వేల సంఖ్యలో జనం సంచరిస్తూ ఉంటారు. ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూసే ప్రదేశం కూడా ఇదే కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా బస్టాండ్‌లో నీరు నిలిచి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. బస్సులు సైతం నీటి నుంచి రావడం బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు పడ్డ తిప్పలు అంతాఇంతా కాదు. ఇదిలా ఉండగా కరీంనగర్ చౌరస్తాలో బస్సులు నిలిపే ప్రదేశంలో నీరు నిలిచి ఉండటంతో ప్రయాణికులు బస్సులకోసం ఎక్కడ వేచి చూడాలో అర్ధంకాని పరిస్థితి. మూడురోజులుగా కురుస్తున్న వర్షానికి నీరునిలిచి ఆప్రాంతం మొత్తం కంపు కొడుతోంది. అంతేకాకుండా స్థానిక అంబేద్కర్‌చౌక్, ఊత్కూర్ చౌరస్తాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికే నీరునిలిచి కుంటలను చెరువులను తలపిస్తున్నాయి.

వాగులను తలపిస్తున్న బీట్ బజార్..

లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని బీట్ బజార్ ఏరియా వ్యాపారాలకు పెట్టింది పేరు. అన్నిరకాల వ్యాపార సముదాయాలు ఉండే ఏరియా. అంతే కాకుండా వ్యవసాయ మార్కెట్ యార్డు కూడా ఇక్కడే ఉంది.మార్కెట్ యార్డు ముందు చిన్నపాటి వర్షం కురువగానే ఆప్రాం తంలో రోడ్డుపై నీరునిలిచి వాగులను తలపిస్తున్నాయి. కొంత మంది వ్యాపారులు డ్రైనేజీని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో అక్కడ నీరు నిలుస్తుందని ఆప్రాంత ప్రజలు వాపోతున్నారు. లక్షెట్టిపేట పట్టణంలో గ్రామపంచాయ తీగా ఉన్న సమయంలో నిర్మించిన డ్రైనేజీలు కావడం వాటికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అవతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది తలెత్తక ముందే జాగ్రత్తలు తీసుకుంటే బాగుటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

మాస్టర్ ప్లాన్ అమలు ఏమైంది?

- సర్వే పూర్తి చేసిన అధికారులు
- పట్టాలెక్కితే తీరనున్న పట్టణ సమస్యలు
- ఇరుకు రోడ్లలో వాహనదారుల అవస్థలు

6

ఇళ్లల్లోకి డ్రైనేజీ నీళ్లు వచ్చాయి..

- కొట్టె సురేష్, 11వార్డు నివాసి

శనివారం మధ్యాహ్నం ఒక గంట సేపు వర్షం కురిసింది. గంట పాటి వర్షానికే డ్రైనేజీ నిండి ఏకంగా ఇండ్లలోకే నీళ్లు రావడంతో కంపు వాసన భరించలేక పిల్లలను తీసుకుని బయటకు వచ్చి ము న్సిపాలిటీ వాళ్లకు సమాచారం ఇచ్చా. వాళ్లు వచ్చి డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు ఇళ్లలో చేరిన నీటిని తొలగించడంతో ఊపిరి పీల్చుకున్నాం. 30 నుంచి 40ఏండ్ల క్రితం కట్టిన డ్రైనేజీ కా వడం అదికూడా గతంలో చైర్మన్ ప్రాతినిధ్యం వహించిన వార్డు అయి ఉండి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

కాలనీ కంపు కొడుతోంది...

- వేణుగోపాల్, లక్షెట్టిపేట

లక్షెట్టిపేటలో 4వార్డులో డ్రైనేజీలు శుభ్రం చేయక కాలనీ మొ త్తం కంపు కొడుతోంది. శనివారం కురిసిన వర్షానికి డ్రైనేజీలు నిం డి ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో నానా అవస్థలు పడాల్సి వచ్చిం ది. మురికి నీటితో పాటు వింత వింత పురుగులు చిన్నపాటి పా ములు కూడా వచ్చాయి. రానున్నది వర్షాకాలం అధికారులు ముం దునుండే జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.